క్లుప్తంగా

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

మాగనూర్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వుంజనూరు ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహాధర్నకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సీఐటీయూ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించకుండా కార్మిక నేతలను అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా ముగించాలి



మాగనూర్: ఉపాధిహామీ కూలీలు ఎండలను దృష్టిలో ఉదయం తొందరగా వచ్చి పనులు ముగించుకోవాలని ఎంపీడీవో రహ్మతుద్దీన్ సూచించారు. శుక్రవారం మాగనూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. మౌలిక వసతులపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సహాయకులను ఆదేశించారు. అనంతరం సఖీ కేంద్రం నుంచి మహిళల భద్రత, సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి, మేట్ కుర్వ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్



మక్తల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని షిఫా మస్జిద్ వద్ద ముస్లింలకు మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన అన్వర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి హాజరైయ్యారు. ప్రత్యేక ప్రార్థన అనంతరం విందు ఆరగించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, జుబూర్‌పాష, రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్వ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమయ్య తెలిపిన వివరాలు.. పెద్దకడ్మూర్ గ్రామానికి చెందిన మంగలి ఆనంద్(55) ఈనెల 19న పొలానికి వెళ్లి వస్తుండగా వెనుక నుంచి గ్రామానికి చెందిన తెలుగు వెంకటప్ప బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హుబ్లీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుడు మంగలి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి



రాజోళి: కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం అలంపూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు గ్రామాల్లో ప్రజలు, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు, పనులు జరిగే చోట టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారని వాటిని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జయన్న, నర్సింహ, సురేష్‌బాబు, అంజనేయులు తదిదరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంత నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులను పరీక్ష హాలులోకి ఉపాధ్యాయులు అనుమతించారు.

- ధన్వాడ మండలం కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 206 మంది విద్యార్థులు, మోడల్ పాఠశాలలో 210, కొండాపూర్ పాఠశాలలో 226 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.
- మరికల్ మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. బాలికల గురుకుల, బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- దామరగిద్ద మండల కేంద్రం, కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రం, క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 239 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈఓ కృష్ణారెడ్డి తెలిపారు.
- మక్తల్ పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1371 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మక్తల్ ఎస్‌ఐ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 245 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సీఎస్ గోపాల్‌చారీ, డీఈఓ మహేష్ తెలిపారు. ఎస్‌ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.
- నర్వ మండల కేంద్రంలో పరీక్షకు 469 విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సెంటర్ కోఆర్డినేటర్‌లు రాంరెడ్డి, భాగ్యలక్ష్మి, గురుపాదంలు తెలిపారు.
- కృష్ణా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 279 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.
- ఊట్కూరులోని మిల్లత్ హైస్కూల్ ఉర్దూ మీడియం విద్యార్థి మహమ్మద్ ఉమర్ అనే విద్యార్థి పరీక్ష ప్రారంభమైన 15 ని.లకు రావడంతో సంబంధిత అధికారులు పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 468 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పులిమామిడి ఉన్నత పాఠశాలలో 141 మంది, పులిమామిడి కేజీబీవీలో 110, ఊట్కూరు బాలుర ఉన్నత పాఠశాలలో 99 మంది, ఊట్కూరు బాలికల ఉన్నత పాఠశాలలో 120 మంది హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్లు దత్తురావు, నాగార్జున, శ్రీధర్, వెంకటస్వామి తెలిపారు.
- గుండుమాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కోస్గి పట్టణంలోని బాలుర, బాలికల, శాంతినికేతన్, కృష్ణవేణి హైస్కూల్‌లో పరీక్షల కేంద్రాల్లో 622 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- మద్దూరు పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు, కృష్ణవేణి ప్రాథమికోన్నత పాఠశాలలో 216 మంది విద్యార్థులు, ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ పాఠశాలలో 194 మంది, గీతాంజలి ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ బాలకిష్టప్ప తెలిపారు.


ధన్వాడలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


కోస్గి బాలుర ఉన్నత పాఠశాల వద్ద..


మాగనూర్‌లో నంబర్ చెక్ చేసుకుంటున్న విద్యార్థులు


ఊట్కూరు పరీక్ష కేంద్రం దగ్గర నిరాశగా వెనుదిరిగిన విద్యార్థి ఉమర్

ఖగోళ అంశాలపై అవగాహన

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్లానెటరీ అడ్వైజర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రఘునందన్‌కుమార్ ఖగోళ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా కాలమానం, వాతవరణం, పగలు, రాత్రి ఎలా ఏర్పడుతాయి అనే అంశాలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. అదే విధంగా ముడుమాల్ గ్రామంలో 3500ల సంవత్సరాల క్రితం ఆదిమానవులు ఏర్పాటు చేసిన నిలువురాళ్ల చరిత్ర, కాలమానానికి ఏ విధంగా ఉపయోగించుకున్నారో తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్ సింగ్, శ్రీనివాసులు, తిరుమలరావ్, చంద్రశేఖర్, నర్మద, రవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రఘునందన్‌రావ్

విద్యార్థులకు వాహన సదుపాయం



ధన్వాడ: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం సొంత ఖర్చులతో వాహన సదుపాయాన్ని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఏర్పాటు చేశారు. మండలంలోని గున్ముక్ల గ్రామం నుంచి ధన్వాడ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి సరైన వాహన సదుపాయాలు లేకపోవడంతో వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రవీణ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో హన్మిరెడ్డి, కృష్ణయ్య, గురునాథ్‌రెడ్డి, నర్సిములుగౌడ్, రవిగౌడ్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం కృషి చేయాలి

మక్తల్: రాజ్యాధికారం కోసం బహుజనులు నిరంతరం కృషి చేయాలని మహాత్మా జ్యోతిరావ్ పూలే సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకిటి అంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలో పూలే బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల నుంచి బహుజనులు జనాభాల్లో సగమైనప్పటికీ ఐక్యత లోపం వల్ల రాజ్యాధికారాన్ని కోల్పోయామన్నారు. కార్యక్రమంలో రాసత్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్, శివశంకర పృధ్వీరాజ్, గుంటి రఘు, చంద్రశేఖర్, నర్సిములు, నరేస ప్రవీణ్‌కుమార్, కుర్వ బాలు, ఎల్లప్ప, కుర్వ ఆంజనేయలు, రమేస అనంద్‌గౌడ్, కృష్ణ, వెంకటేష్, ఆశోక్, బీయేస తదితరలు పాల్గొన్నారు.


సమావేశంలో బీసీ సంఘ నాయకులు

అడవుల విస్తీర్ణం పెంచుదాం



కోస్గి రూరల్: విస్తృతంగా మొక్కలు నాటి అడవుల విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త వార్ల మల్లేషం అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అడవుల సంరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన బంతులపై అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలి


కర్నిలో వైద్యుడికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ధన్వాడ/మక్తల్/మాగనూర్: జాతీయ ఆరోగ్య మిషన్ పథకాన్ని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు, సామాజిక భద్రతా, పెన్షన్ అమలు తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిత, మంగమ్మ, వనమల, మాసమ్మ నర్సింగమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

- ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజ్ అన్నారు. శుక్రవారం మక్తల్ మండలం కర్ని పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజ్, అధ్యక్షురాలు యశోద, అమీనాబేగం, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనిత, సుజాత, అనురాధ, సావిత్రమ్మ, రాజేశ్వరి, కళవతి, పుష్ప, రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.
- మాగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలియజేశారు. అనంతరం మెడికల్ అధికారికి అఫ్రోజ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతమ్మ, పారిజాత, కృష్ణవేణి, అనంతమ్మ, రేణుక పాల్గొన్నారు.

మూడోసారి రాష్ట్రస్థాయి అవార్డు



నారాయణపేట రూరల్: మండలంలోని 108 అంబులెన్స్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ మూడోసారి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ ఆడిట్ అధికారి ఫయాజ్ సమక్షంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రాం అధికారి రవికుమార్, నారాయణపేట జిల్లా కోఆర్డినేటర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పట్టణంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఘనంగా శాలువాతో సన్మానించి, ఉత్తమ ఉద్యోగి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

ఊట్కూరు: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కోటి చెన్నప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఊట్కూరులో ఈనెల 25న మహబూబ్‌నగర్ జరిగే రాష్ట్ర మూడో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికి ప్రభుత్వం కార్మిక శాఖ ద్వార సంక్షేమ పథకాలను అందించాలన్నారు. పెళ్లి కానుక, ప్రసూతి సహాయం, సహజ మరణం, ప్రమాద మరణాలకు వేలాదిమంది కార్మికులు దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వం ద్వార నిధులు మంజూరు కాక పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికై న ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, శ్రీకాంత్, నందు, కుమ్మరి లక్ష్మన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకుందామని పీవైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో భగత్‌సింగ్‌కి పూలమాలలతో నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు విష్ణు, గణేశ్, రాహుల్, మహేశ్, రాకేష్, ఆంజనేయులు, శివకుమార్, ఆర్యన్, పురుషోత్తం, సురేష్, లక్ష్మీ, రాజు, మంజుల, కావేరి, నందిని, మీనాక్షి, కవిత పాల్గొన్నారు.

కోనేరు కబ్జాపై ఫిర్యాదు

నర్వ: మండల కేంద్రంలోని మస్జిద్ ముందు ఉన్న బగాయితీ బావి(కోనేరు) కబ్జాకు గురికావడంపై తహసీల్దార్ మల్లారెడ్డికి వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఈ సమస్యపై 2021లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 800 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించిన కోనేరు నుంచి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించేవారన్నారు. ప్రస్తుతం కోనేరును కబ్జా చేసి ప్రహరీ నిర్మాణం చేస్తునట్లు పేర్కొన్నారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో వావిళ్ల రవికుమార్‌రెడ్డి, రవీంద్రసింగ్, డీజే రవి, అశోక్, శరత్, తదితరులు పాల్గొన్నారు.


నర్వ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

బీటీరోడ్డు కోసం రైతుల నిరసన

మరికల్: మండలంలోని అప్పంపల్లి నుంచి మాధవరానికి బీటీరోడ్డు మంజూరు చేయాలని శుక్రవారం రైతులు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే బురదలో ప్రయాణించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు స్పందించి అప్పంపల్లి, మాధవరం రోడ్డును బీటీగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయరెడ్డి, రాజప్ప, తిరుపతిరెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రైతులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఊట్కూరు: భూగర్భ జలాలు అడుగంటి రబీ సీజన్‌లో వేసుకున్న పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట రామారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని నిడుగుర్తి శివారులో వరి పంటలను పరిశీలించారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీరు సమృద్ధిగా రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నాలుగు ఎకరాలు సాగు చేసిన రైతులకు ఎకరా పంటకు కూడ నీరు అందడం లేదన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టి పంట నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ, రైతు సంఘం నాయకులు శంకర్, అంజప్ప, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నిడుగుర్తి శివారులో వరి పంట పరిశీలిస్తున్న నాయకులు

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

మక్తల్: పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ధైర్యంతో పరీక్షలు హాజరు కావాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విద్యార్థులకు తెలియజేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడారు. పలు సూచనలు అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అంగన్‌వాడీల్లో చిన్నారుల అవస్థలు


మక్తల్‌లో రెండు సెంటర్లు కలిసి ఒకే చోట నిర్వహిస్తుండటంతో వరండాలో కూర్చున్న చిన్నారులు(ఫైల్)

- ఇరుకు గదుల్లో ఉక్కపోతలు
- గర్భిణులు, బాలింతలకు కూడా

మక్తల్: మార్చి నెలలోనే ఎండలు ముదరడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు ఎండ బారిన పడకుండా మార్చి 15 నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయించింది. ఉదయం 8 గంటల నుంచి 12:30 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం పిల్లలను ఇంటికి పంపిస్తారు.

704 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లోని 280 ప్రాజెక్టుల్లో 704 కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 22 వేల మంది చిన్నారుల అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుంటారు. మక్తల్, నారాయణపేట, మద్దూరులో కొన్ని భవనాల్లో రెండు కేంద్రాలను కలిపి నిర్వహిస్తుండటంతో చిన్నారులు ఇబ్బందులు పడున్నారు. జిల్లా వ్యాప్తంగా 284 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహణ సరిగా లేక చిన్నారుల అవస్థలు పడుతున్నారు. గదులు ఇరుకుగా ఉండటంతో వరండాల్లో పిల్లలను కూర్చోబెడుతున్నారు. దీంతో ఎండ వేడిమితో పాటు ఉక్కపోతలకు అల్లాడుతున్నారు.

ఫ్యాన్లు కూడా లేని దుస్థితి..

జిల్లాలోని చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల రెండు కేంద్రాలను ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. వాటిల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేవని బాలింతలు, గర్భిణులు ఆరోపిస్తున్నారు. దీంతో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలంటేనే తల్లిదండ్రులు జంకుతున్నారు.

గర్భిణులు, బాలింతలకు కూడా..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం, చిన్నారులతో పాటు రావడం తదితర పనులపై వచ్చినపుడు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. కేంద్రాల్లో తగిన సౌకర్యాలు లేకపోవడం, గాలి వెలుతురు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

> **ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..**
>
> జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ఎండలు అధికంగా ఉండటంతో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించాం. కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా సిబ్బందికి సూచించాం.
>
> – జయ, డీడబ్ల్యూఓ, నారాయణపేట